# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 365
పేజీలు : 08 | వెల: రూ.5/-

శనివారం
నవంబర్ 29, 2025

www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




8లో..

## ఘనంగా ముగిసిన జిల్లా స్థాయి ఇన్స్పైర్

- వాణి విద్యానికేతన్ విద్యార్థికి రెండో బహుమతి
- రాష్ట్ర స్థాయికి ఎంపికైన దీక్షిత్

# కనిపించని.. చిత్తశుద్ధి




వివరాలు2లో..

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను ప్రభుత్వం నిషేధించిన నేపథ్యంలో వరంగల్ మహా నగర పాలక సంస్థ మేయర్ గుండు సుధారాణితోపాటు అధికారులు ప్లాస్టిక్ నేషేధంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చి దిద్దాలంటూ ప్రకటనలు చేస్తున్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ తో కలిగే అనర్థాలను గుక్క తిప్పుకోకుండా చెబుతున్నారు. ప్లాస్టిక్ వినియోగంతో కాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు వస్తాయంటూ బెంబేలెత్తిస్తున్నారు. అందరూ బయో డి గ్రేబుల్, బట్ట, కాగితం, జూట్ సంచులను వినియోగించాలంటూ సూచిస్తున్నారు. అయితే చెప్పేందుకే నీతులు అన్నట్టుగా బల్దియా అధికారులు మాత్రం అవే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లను వినియోగించడం విస్మయానికి గురిచేస్తోంది. ప్లాస్టిక్ తో కలిగే అనర్థాలను ప్రజలకు తెలియజేయాలన్న లక్ష్యంతో ముద్రించిన కరపత్రాలను తరలించేందుకు ఈ కవర్లనే ఉపయోగిస్తున్నారు. మేయర్ సమక్షంలోనే ప్లాస్టిక్ కవర్ల వినియోగం జరుగుతున్నా ఇవేమీ పట్టించుకోకపోవడంపై పర్యావరణ ప్రేమికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఆవు చేలో మేస్తే.. దూడ గట్టున మేస్తుందా అన్నట్టుగా ఉంది బల్దియా పాలకవర్గం, అధికారుల పని తీరు అంటూ సెటైర్లు వేస్తున్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని అడుకోవాల్సిన అధికారులే ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తే ఇక నిషేధం ఒట్టిమాటేనా అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ గుట్టలుగా పేరుకుపోతోందని మండిపడుతున్నారు.

– వరంగల్ వాయిస్ ప్రతినిధి

### విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగం

- నగరంలో కానరాని నిషేధం
- కళ్ల ఎదుటే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విక్రయాలు
- ఉపన్యాసాలతో ఊదర కొడుతున్న పాలకులు
- గుట్టలుగా పేరుకుపోతున్న వ్యర్థాలు
- పర్యావరణానికి పొంచివున్న ముప్పు

# కేసీఆర్ పోరాటంతోనే తెలంగాణ సాకారం

☐ బీఆర్ఎస్ నాయకులు ☐ నక్కలగుట్ట వద్ద దీక్షా దివస్ కార్యక్రమం



2లో..




8లో..

# స్వప్నం సాకారమవుతోంది

75 శాతం పూర్తయిన రైల్వే తయారీ యూనిట్
వచ్చే ఏడాదికి పనులు పూర్తి | కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి

# కనిపించని.. చిత్తశుద్ధి

- విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగం
- కళ్ల ఎదుటే సింగిల్ యూస్ ప్లాస్టిక్ విక్రయాలు
- ఉపన్యాసాలతో ఊదరగొడుతున్న పాలకులు
- నగరంలో కానరాని నిషేధం
- గుట్టలుగా పేరుకుపోతున్న వ్యర్థాలు
- పర్యావరణానికి పొంచివున్న ముప్పు

**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం మచ్చుకైనా కనిపించడం లేదు. విచ్చల విడిగా విక్రయాలు జరుగుతున్నా బల్దియా అధికారులు తూతూ మంత్రంగా దాడులు చేసి చేతులు దులుపుకుంటున్నారు. కళ్ల ముందే నిషేధిత ప్లాస్టిక్ కవర్లతో పాటు ఇతరాలు విక్రయిస్తున్నా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. చెప్పేందుకే నీతులు అన్నట్లుగా గ్రేటర్ అధికారులు వ్యవహరించడంపై పర్యావరణ ప్రేమికులు మండిపడుతున్నారు.



### అవగాహన పెంచుదాం..

మేయర్ గుండు సుధారాణితోపాటు సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, ఈఈ రవి కుమార్, డీఈ రాగి శ్రీకాంత్, సానిటరీ సూపర్ వైజర్ నరేందర్ తదితరులు ఇటీవల హనుమకొండలోని బాల సముద్రం (ఎల్ఐసీ) మార్కెట్ ను సందర్శించారు. ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నగర మేయర్ ముఖ్య అతిథిగా హాజరై ప్లాస్టిక్ తో జరిగే అనర్థాలను తెలియజేశారు. పర్యావరణ హిత మార్కెట్ గా తీర్చిదిద్దాలంటూ హితవు పలికారు. మార్కెట్ లో వ్యాపారాలు నిర్వహించే ప్రతి ఒక్కరూ తన వంతు బాధ్యతగా సహకరించాలని పిలుపునిచ్చారు. భూమిలో ప్లాస్టిక్ కలిసి పోకుండా రసాయనాలను విడుదల చేయడంతో పర్యావరణం కలుషితం అవుతుందన్నారు. తద్వారా కాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు వస్తాయని అందువల్ల ప్లాస్టిక్ ఉత్పత్తులను నిషేధించాలన్నారు. ప్లాస్టిక్ కు ప్రత్యామ్నాయంగా బయో డి గ్రేబుల్, బట్ట, కాగితపు, జూట్ సంచులను వినియోగించేలా ప్రోత్సహించాలన్నారు. మన జీవన సరళి మార్చుకోవడంలో భాగంగా పర్యావరణాన్ని సంరక్షించి భావి తరాలకు కాలుష్య రహిత జీవనాన్ని అందించాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

### మేయర్ ఎదుటే..

అయితే బాలసముద్రం మార్కెట్ లో అమ్మకం దారులకు, కొనుగోలు దారులకు అవగాహన కల్పించడం వరకు బాగానే ఉన్నప్పటికీ వారు ప్రజలకు పంపిణీ చేసే కరపత్రాలను మాత్రం నిషేధిత ప్లాస్టిక్ కవర్లలోనే తీసుకురావడం వివాదంగా మారింది. మేయర్ సమక్షంలోనే ప్లాస్టిక్ కవర్లను వినియోగించడాన్ని పర్యావరణ ప్రేమికులు తప్పుబడుతున్నారు. ఇదేమి చిత్తశుద్ధి అంటూ మండిపడుతున్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని అడ్డుకోవాల్సిన బల్దియా ఆరోగ్య శాఖ అధికారులే కరపత్రాలను ప్లాస్టిక్ కవర్లలో తరలించడం ఏంటని ప్రశ్నిస్తున్నారు.

### కళ్ల ముందే అమ్మకాలు..

నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విక్రయాలు విచ్చల విడిగా జరుగుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. అసలు ప్లాస్టిక్ కవర్లు నగరంలోకి ప్రవేశించకుండా అడ్డుకోవాల్సి ఉన్నప్పటికీ ఇవేమీ పట్టించుకోకుండా నిషేధం అమలు కావాలంటూ ప్రకటనలు చేయడంతోనే అధికారులు సరిపెడుతున్నారన్న ప్రచారం సాగుతోంది. పుట్ట గొడుగుల్లా ప్లాస్టిక్ వస్తువుల విక్రయ దుకాణాలు వెలుస్తున్నా, విక్రయాలు జరుగుతున్నా మామూళ్ల మత్తులో అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదన్న విమర్శలొస్తున్నాయి. అధికారులు, పాలకవర్గం చిత్తశుద్ధితో ప్లాస్టిక్ నియంత్రకణకు కృషి చేయాల్సిన అవసరం ఉంది.



## ఘనంగా ముగిసిన జిల్లా స్థాయి ఇన్స్పైర్

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ జిల్లా స్థాయి ఇన్స్పైర్, బాల వైజ్ఞానిక ప్రదర్శన ఉర్సుగుట్టలోని తాళ్ళ పద్మావతి ఇంటర్నేషనల్ స్కూల్లో శనివారం ఘనంగా ముగిసింది. మూడు రోజులపాటు నిర్వహించిన ఈ ప్రదర్శనలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన విద్యార్థులు తమ సృజనాత్మక శాస్త్రీయ మోడళ్ళను ప్రదర్శించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విద్యాశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు సత్యనారాయణ రెడ్డి హాజరై విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆధునిక ప్రపంచంలో శాస్త్రవిజ్ఞానం పాత్ర అమోఘమని పేర్కొంటూ, ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో పరిశోధనాశక్తి, సమస్యల పరిష్కార నైపుణ్యం, సైన్స్‌పై ఆసక్తి పెరుగుతుందని అన్నారు. కార్యక్రమం కన్వీనర్ డీఈఓ రంగయ్య నాయుడు ప్రసంగిస్తూ, శాస్త్రీయ రంగంలో ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులను చూసి గర్వంగా ఉందన్నారు. గురువుల కృషి, తల్లిదండ్రుల ప్రోత్సాహం, విద్యార్థుల ప్రతిభ కలిసినప్పుడే ఇలాంటి విజయాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ కట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ, వార్షికంగా నిర్వహించే ఇన్స్పైర్ మరియు బాల వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థుల శాస్త్రీయ ప్రతిభను వెలికితీస్తాయని చెప్పారు. ప్రదర్శనలో జిల్లా స్థాయికి 164 ఎంపిక కాగా వీటి నుంచి పది శాతం అనగా 16 ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. తాళ్ళ పద్మావతి ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థి మునజా హఫియా ప్రథమ స్థానం పొంది రాష్ట్ర స్థాయికి ఎంపికైంది.

### వాణి విద్యానికేతన్ విద్యార్థికి రెండో బహుమతి..



దేశ రాజధాని ఢిల్లీలో రోజు రోజుకూ పెరిగిపోతున్న వాయు కాలుష్యంనుంచి రక్షణ కల్పించాలన్న ఉద్దేశంతో ఎస్.ఆర్.ఆర్ తోటలోని వాణి విద్యానికేతన్ స్కూల్ విద్యార్థిని కావ్య శ్రీ రూపొందించిన ఎగ్జిబిట్ కు రెండో బహుమతి అభించింది. కాలుష్యాన్ని గాలిలోకి వదలకుండా, మూలం వద్దనే సేకరించడం ద్వారా దానిని వ్యర్థంగా చూడకుండా, పర్యావరణ అనుకూల ఉత్పత్తులుగా మార్చవచ్చు అనే ఆమె కాన్సెప్ట్ జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకుంది.

# కేసీఆర్ పోరాటంతోనే తెలంగాణ సాకారం

- బీఆర్ఎస్ నాయకులు
- నక్కలగుట్ట వద్ద దీక్షా దివస్ కార్యక్రమం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఉద్యమ నేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు 2009లో చేసిన ఆమరణ దీక్షను పురస్కరించుకొని, శనివారం హనుమకొండలోని నక్కలగుట్ట వద్ద గల కాళోజీ విగ్రహం వద్ద దీక్షా దివస్ కార్యక్రమాన్ని బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. సమావేశానికి ముందు తెలంగాణ అమరవీరులకు మౌనం పాటించి, నివాళులు అర్పించారు. అనంతరం తెలంగాణ అమర వీరుల స్థూపానికి, తెలంగాణ తల్లి విగ్రహానికి, కాళోజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ అగ్ర నాయకులు కేసీఆర్ పోరాటం, పాలనపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. శాసనమండలి ప్రతిపక్ష నేత, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనా చారి మాట్లాడుతూ తెలంగాణ కోసం ప్రాణాలకు తెగించి పోరాడిన వీరుడు కేసీఆర్ అని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటే లక్ష్యంగా 14 ఏళ్లు అకుంఠిత దీక్షతో ఉద్యమాన్ని నడిపిన నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. తెలంగాణ అణువణువూ తెలిసి, ప్రజల గోసలను ప్రపంచానికి తెలిపి, స్వరాష్ట్రాన్ని సాధించిన ఉద్యమ నేత కేసీఆర్ అని, 4 కోట్ల తెలంగాణ ఆకాంక్షను నెరవేర్చిన కారణజన్ముడు ఆయన అని అన్నారు. తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని ఉద్యమం ద్వారా భావజాల వ్యాప్తి చేసి, సకల జనులను ఏకం చేసి, స్వరాష్ట్ర ఏర్పాటు తీరానికి చేర్చిన గొప్ప దార్శనికుడు కేసీఆర్ గారు. 60 ఏళ్లలో జరిగిన వివక్షతను, అన్యాయాన్ని ప్రజలకు తెలిసేలా చేసి, నాటి పాలకుల మెడలు వంచి తెలంగాణను కొట్లాడి సాధించిన నేత ఆయన. రాజ్యసభ మాజీ సభ్యులు కెప్టెన్ లక్ష్మీకాంత రావు మాట్లాడుతూ కేసీఆర్ పోరాటం వలనే తెలంగాణ వచ్చింది. కేసీఆర్ గారి ఉద్యమ ప్రస్థానంలో 2001 నుంచి నేటి వరకు తాను కొనసాగానని తెలిపారు. 2009లో కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్షకు బయలుదేరిన నాడు వెంట ఉన్నామని గుర్తు చేసుకున్నారు. కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్షకు తెలంగాణ ప్రజలందరు రోడ్ల పైకి వచ్చారని, కేసీఆర్ గారి అక్రమ అరెస్ట్‌ను నిరసిస్తూ తెలంగాణ సమాజం ఉద్యమాన్ని తమ భుజాలపై వేసుకుందని అన్నారు. కేసీఆర్ గారిని అరెస్ట్ చేసి కరీంనగర్ నుంచి ఖమ్మం జైలుకు తరలించినా, ఆయన దీక్షపై కుట్రలు చేసినా, 11 రోజుల పాటు ప్రాణాలకు తెగించి, చావు నోట్లో తలకాయ పెట్టి తెలంగాణ సాధించారని కొనియాడారు. నాటి కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ మెడలు వంచి కేసీఆర్ గారు తెలంగాణను సాధించారు. 14 ఏళ్ల పోరాటం, 10 ఏళ్ల పాలనలో తెలంగాణను దేశంలోనే నెంబర్ 1గా నిలిపిన బంగారు తెలంగాణ నిర్మాత కేసీఆర్ గారన్నారు. ఇప్పుడు అధికారంలో ఉన్న వారికి తెలంగాణ ప్రజల ప్రయోజనాలు పట్టడం లేదని, ప్రశ్నించే వారిని బెదిరిస్తున్నారని, ప్రజలకు ఏం చేయలేని పాలనకు నిదర్శనం నేటి కాంగ్రెస్ సర్కారు అని విమర్శించారు.

ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యులు, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజల 60 ఏళ్ల కలను సాకారం చేసిన నేత కేసీఆర్, 14 ఏళ్ల సుదీర్ఘ పోరాటం చేసి తెలంగాణను కొట్లాడి తెచ్చిన ఉద్యమనేత కేసీఆర్ అన్నారు. 10 ఏళ్ల కేసీఆర్, బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ ప్రజలకు సంక్షేమాన్ని, అభివృద్ధిని అందించిన ఘనత కేసీఆర్ దేనని పేర్కొన్నారు. 'కేసీఆర్ సచ్చుడో తెలంగాణ వచ్చుడో' అనే రణ నినాదంతో తెలంగాణ స్వరాష్ట్ర ఏర్పాటుకు ఉద్యమించిన పోరు పతాకం కేసీఆర్. కేసీఆర్ గారి ఆమరణ నిరాహార దీక్ష, 11 రోజుల ఉధృత ఉద్యమ ఫలితమే డిసెంబర్ 9న తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రకటన, ఉద్యమకారుల బలిదానాలు, సకల జనుల పోరాట ఫలితమే తెలంగాణ స్వరాష్ట్రం. సకల జనులు, సబ్బండ వర్గాలను కదిలించి, ఉద్యమ కదన రంగంలో నిలిపిన నేత, ఉద్యమ శిఖరం కేసీఆర్ అని కొనియాడారు. అలుపెరగని పోరాటం చేసి సాధించిన తెలంగాణను, కేసీఆర్ గారు దేశంలోనే గొప్ప రాష్ట్రంగా తీర్చిదిద్దిన గొప్ప పాలకుడన్నారు. రెండు ఏండ్ల క్రితం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ తెలంగాణ సమాజాన్ని అన్ని రకాల ఇబ్బందులకు గురి చేసింది.

కేసీఆర్ గారి హయాంలో పాలన వికాసం జరిగితే, నేడు కాంగ్రెస్ హయాంలో పరిపాలన విధ్వంసం జరుగుతోందని విమర్శించారు. ప్రశ్నించే శక్తులను కేసుల పాలు చేసి బెదిరిస్తున్నారని, బీఆర్ఎస్, కేసీఆర్, కేటీఆర్ నాయకత్వంలో గులాబీ శ్రేణులు తెలంగాణ ప్రజల పక్షాన రానున్న రోజుల్లో పోరాడుతాయని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, వొడితల సతీష్ బాబు, మాజీ చైర్మన్లు నాగూర్ల వెంకటేశ్వర్లు, లింగంపెల్లి కిషన్ రెడ్డి, మర్రి యాదవ రెడ్డి, ఎల్లావుల లలీతా యాదవ్, గ్రేటర్ వరంగల్ డిప్యూటీ మేయర్ రిజ్వానా మసూద్, కార్పొరేటర్లు సోదా కిరణ్, బొంగు అశోక్ యాదవ్, చెన్నం మధు, సంకు నర్సింగ రావు, బోయినపల్లి రంజిత్ రావు, ఇమ్మడి లోహితా రాజు, మాజీ కార్పొరేటర్లు జోరిక రమేష్, కుసుమ లక్ష్మీనారాయణ, ఉడతల సారంగపాణి, నాయకులు జనార్ధన్ గౌడ్, రవీందర్ రావు, నాయీమొద్దీన్, పులి రజినీకాంత్, రజినీకుమార్, హరి రమాదేవి, దూలం వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# అసైన్డ్ భూముల హక్కులపై తక్షణమే నిర్ణయం తీసుకోవాలి

■ అడ్వకేట్ కలకోటి మహేందర్ డిమాండ్

**వరంగల్ వాయిస్, కమలాపూర్:** అసైన్డ్ భూములకు పూర్తి హక్కులు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే నిర్ణయం తీసుకోవాలని అసైన్డ్ భూమి సమితి (ఏబీఎస్) వ్యవస్థాపక అధ్యక్షులు, న్యాయవాది కలకోటి మహేందర్ డిమాండ్ చేశారు. హామీ ఇచ్చి మాట తప్పితే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శనివారం కమలాపూర్ మండల కేంద్రంలోని స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏబీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కలకోటి మహేందర్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ వరంగల్‌లో నిర్వహించిన రైతు గర్జన సభలో రాహుల్ గాంధీ సమక్షంలో వరంగల్ డిక్లరేషన్ ప్రకటించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అసైన్డ్ భూములపై రైతులకు పూర్తి హక్కులు ఇస్తామని ఆ సభలో హామీ ఇచ్చారని, అయితే అధికారం చేపట్టిన తర్వాత ఆ హామీని తుంగలో తొక్కుతున్నారని ఆయన ఆరోపించారు. అసైన్డ్ భూములపై పూర్తి హక్కుల కోసం వేలాది మంది రైతులు



ఎదురుచూస్తున్నారని, ఈ విషయంలో ప్రభుత్వం జాప్యం చేయకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే ఈ అంశంపై దృష్టి సారించి, అసైన్డ్ భూములపై రైతులకు పూర్తి హక్కులు కల్పిస్తూ నిర్ణయం తీసుకోవాలని కలకోటి మహేందర్ డిమాండ్ చేశారు. హామీని అమలు చేయడంలో విఫలమైతే అసైన్డ్ రైతుల నుంచి భారీ ఎత్తున ఉద్యమం తప్పదని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శనిగరపు రాజు, ఇనుగాల సాంబయ్య, రామంచ సారయ్య, శనిగరపు కన్నయ్య, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# బీసీలను కాంగ్రెస్ ఘోరంగా మోసం చేసింది



■ మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

**వరంగల్ వాయిస్, పరకాల:** తెలంగాణలో బీసీలను కాంగ్రెస్ పార్టీ ఘోరంగా మోసం చేసిందని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మండిపడ్డారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలు '420 హామీలు'గా మిగిలిపోయాయని ఆయన విమర్శించారు. సంగెం మండలంలోని పల్లారుగూడ గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు ఆ పార్టీకి రాజీనామా చేసి, మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ధర్మారెడ్డి వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలు పూర్తిగా 420 హామీలుగా మారిపోయాయి. దొంగ హామీలతో ప్రజలను దారితప్పించిన కాంగ్రెస్ పాలనలో బీసీలకు న్యాయం జరగలేదు" అని ఆరోపించారు. రిజర్వేషన్ల అంశంపై మాట్లాడుతూ, బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పి, కేవలం 17శాతం రిజర్వేషన్లు మాత్రమే ఇచ్చిన కాంగ్రెస్ నాయకత్వం మాట తప్పిందని ధర్మారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ సమాజం ఐక్యంగా నిలబడి, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ కార్యకర్తలు అందరూ ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన బోగస్ హామీలను ప్రజలకు తెలియజేసి, వారి మోసపూరిత రాజకీయాలను ఎండగట్టాలని మాజీ ఎమ్మెల్యే సూచించారు. పార్టీలో చేరిన వారిలో గుగులోతు సమ్ములు, సరోజనలతో పాటు పలువురు నాయకులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కాట్రపల్లిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతా

➲ సర్పంచ్ అభ్యర్థి గడ్డం నాగార్జున

**వరంగల్ వాయిస్, కేసముద్రం :** మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం కాట్రపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా గడ్డం నాగార్జున శనివారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాట్రపల్లి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా చేయడమే తన ప్రధాన లక్ష్యమని ప్రకటించారు. తాను విద్యార్థి ఉద్యమాలలో గత 20 సంవత్సరాలుగా అనేక పోరాటాలు చేసి విజయాలు సాధించిన చరిత్ర ఉందని నాగార్జున గుర్తు చేసుకున్నారు. "తెలంగాణ ఉద్యమంలో ఎన్నో పోరాటాలు చేసి, కాకతీయ యూనివర్సిటీ కేంద్రంగా ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు వరకు జైలుకు కూడా లెక్కచేయకుండా కొట్లాడి రాష్ట్రాన్ని సాధించుకున్నాం" అని తెలిపారు. ప్రస్తుతం తాను అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నానని పేర్కొన్నారు. ఎన్ని ప్రభుత్వాలు



మారినా కాట్రపల్లి గ్రామం అభివృద్ధికి నోచుకోలేదని నాగార్జున ఆవేదన వ్యక్తం చేశారు. "గ్రామ ప్రజలు ఆర్థికంగా, సామాజికంగా, అభివృద్ధి పరంగా వెనుకబడిపోయారు. కాట్రపల్లిలో యువత నిరుద్యోగం పెరిగి నిరాశకు, నిస్పృహకు లోనవుతున్నారు" అని అన్నారు. కాట్రపల్లి సర్పంచ్‌గా తనకు ఒక్కసారి అవకాశం ఇవ్వాలని గ్రామ ప్రజలను కోరిన ఆయన, తప్పకుండా గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు.

# బీజేపీ సర్పంచులను మోడీకి బహుమతిగా ఇద్దాం

● యువనేత లాడే శివ పిలుపు

**వరంగల్ వాయిస్, శాయంపేట:** తెలంగాణలో గ్రామీణ అభివృద్ధిని వేగవంతం చేయాలంటే గ్రామపంచాయతీ ఎన్నికల్లో బీజేపీ సర్పంచ్ అభ్యర్థులనే అధిక సంఖ్యలో గెలిపించాలని యువనేత లాడే శివ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించి, ఆ విజయాన్ని ప్రధాని నరేంద్ర మోడీకి బహుమతిగా అందజేద్దామని ఆయన కోరారు. గ్రామపంచాయతీ ఎన్నికలు కేవలం స్థానిక సంస్థలకే పరిమితం కాకుండా, కేంద్ర ప్రభుత్వం అందించే 15వ ఆర్థిక సంఘం (ఫైనాన్స్) నిధులు నేరుగా గ్రామాలకు చేరేందుకు ఈ ఎన్నికలు అత్యంత కీలకమని లాడే శివ తెలిపారు. శాయంపేట మండలంలోని 24 గ్రామపంచాయతీలలో బీజేపీ అభ్యర్థులు విజయం సాధిస్తే, భవిష్యత్తులో తెలంగాణ పల్లెల అభివృద్ధికి మరింత బలం చేకూరుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. అభివృద్ధి అంశాలపై మాట్లాడుతూ, గ్రామాల్లో డంపింగ్ యార్డులు, స్మశాన వాటికలు, మౌలిక వసతులు వంటి అంశాల్లో బీజేపీ అధికారం ఉన్న చోట్ల అభివృద్ధి స్పష్టంగా కనిపిస్తోందని ఆయన గుర్తు చేశారు. కరోనా మహమ్మారి సమయంలో పేదలను ఆదుకోవడంలో ప్రధాని నరేంద్ర మోడీ చూపిన నాయకత్వాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఉచిత రేషన్ బియ్యం, కరోనా



వ్యాక్సిన్, జీరో బ్యాలెన్స్ ఖాతాల్లో ఆర్థిక సహాయం వంటి అనేక సంక్షేమ పథకాలను కేంద్రం అమలు చేసి కోట్లాది మందిని కాపాడిన విషయాన్ని లాడే శివ ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఈ సేవలకు గుర్తుగా, గ్రామపంచాయతీ ఎన్నికల్లో బీజేపీ సర్పంచ్‌లను గెలిపించి మోడీకి బహుమతిగా అందిద్దాం అని ఆయన ప్రజలను ఉద్బోధించారు. తెలంగాణ గ్రామాలు మరింత అభివృద్ధి చెందాలంటే ఈ ఎన్నికల్లో ప్రజలు సక్రమంగా ఆలోచించి ఓటు వేయాలని యువనేత లాడే శివ ఆకాంక్ష వ్యక్తం చేశారు.

# కోటగుళ్లను సందర్శించిన అమెరికా దేశస్థుడు



**వరంగల్ వాయిస్, గణపురం :** ప్రసిద్ధిగాంచిన చారిత్రక సంపద, కాకతీయుల కళాక్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం (కోటగుళ్లు)ను శుక్రవారం అమెరికా దేశానికి చెందిన ఒక పర్యాటకుడు సందర్శించారు.అమెరికన్ దేశస్థుడు స్టర్ట్ ఫ్రీమాన్ కోటగుళ్లను సందర్శించి, అక్కడి శిల్పకళా వైభవాన్ని తిలకించారు. ఈ సందర్భంగా ఆయన ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆలయంలోని అద్భుతమైన శిల్ప సంపదను, వాస్తుశిల్పాన్ని ఆసక్తిగా గమనిస్తూ ఫొటోలు, వీడియోలు చిత్రీకరించుకున్నారు. ఆలయ విశిష్టత, చారిత్రక నేపథ్యాన్ని ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు ఆయనకు వివరించారు. పూజల అనంతరం అర్చకులు స్టర్ట్ ఫ్రీమాన్‌కు ఆశీర్వచనాలు పలికి, తీర్థప్రసాదాలను అందజేశారు. కోటగుళ్ల సందర్శన అద్భుతమైన అనుభూతిని ఇచ్చిందని స్టర్ట్ ఫ్రీమాన్ పేర్కొన్నారు.

# శాంతకమణికి ఘన నివాళులు




**వరంగల్ వాయిస్, గణపురం:** మండల కేంద్రంలో ఇటీవల స్వర్గస్తులైన పెద్దలు జంగిలి గోవిందరావు సతీమణి శాంతకమణికి పలువురు నాయకులు నివాళులు అర్పించారు. శనివారం గణపురంలో జరిగిన కార్యక్రమంలో, దివంగత శాంతకమణి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుమారులు జంగిలి వెంకటేశ్వరరావు (పెదబాబు), జంగిలి శ్రీనివాసరావు (చిన్నబాబు)లను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షులు శనిగరపు రాజేందర్, అంబేద్కర్ సంఘం గ్రామ కమిటీ అధ్యక్షులు తిక్క సంపత్, మండల నాయకులు చిలువేరు ఆలూరి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# కనీస సౌకర్యాలు తప్పనిసరి

## ఎఫ్ఎస్టీ అధికారి నాగరాజు



**వరంగల్ వాయిస్, పరకాల :** మండలంలో జరగనున్న స్థానిక సంస్థల (గ్రామపంచాయతీ) ఎన్నికల సన్నద్ధతలో భాగంగా ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ (ఎఫ్ఎస్టీ) పోలింగ్ కేంద్రాలను సందర్శించి తనిఖీ చేసింది. పోలింగ్ బూత్‌లలో కనీస మౌలిక వసతులు తప్పనిసరిగా ఉండాలని ఎఫ్ఎస్టి టీమ్ స్పష్టం చేసింది. పోలింగ్ కేంద్రాలలో కరెంటు సరఫరా, తాగునీటి సౌకర్యం (వాటర్), టాయిలెట్స్ (మరుగుదొడ్లు), వీల్ చైర్ (దివ్యాంగుల సౌకర్యార్థం) వంటి ఏర్పాట్లు పక్కాగా ఉండాలని అధికారులు ఆదేశించారు. ఈ సందర్భంగా ఎఫ్ఎస్టి అధికారి నాగరాజు నాగారం, పైడిపల్లి, మలకపేట, వెంకటాపురం, లక్ష్మీపురం గ్రామపంచాయతీ కార్యదర్శులతో మాట్లాడారు. ఎన్నికల నియమావళి ప్రకారం పోలింగ్ కేంద్రాల వద్ద మరియు పరిసర ప్రాంతాలలో వాల్ రైటింగ్ (గోడ రాతలు), ఫ్లెక్సీలు వంటివి ఉండకూడదని ఆదేశించారు. వాటిని తక్షణమే తొలగించాలని సూచించారు. ఈ పరిశీలనలో ఎఫ్ఎస్టీ అధికారి నాగరాజు, పోలీస్ అధికారి నాగరాజు, కెమెరామెన్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## ‘సర్దార్ @ 150’ ఐక్యత ర్యాలీ




**వరంగల్ వాయిస్, వరంగల్ :** భారతదేశ ప్రభుత్వ ఆదేశానుసారం వరంగల్ జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ‘మై భారత్’ జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో నిర్వహించిన “సర్దార్ @ 150 ఐక్యత ర్యాలీ”లో ఏవీవీ జూనియర్ కళాశాల విద్యార్థులు చురుకుగా పాల్గొన్నారు. ఏవీవీ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కొడిమాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కళాశాల నుంచి 30 మంది విద్యార్థులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు సర్దార్ వల్లభాయ్ పటేల్ కటౌట్‌ను పట్టుకొని వినూత్నంగా, అందరినీ ఆకర్షించే విధంగా తమ ప్రదర్శనను ఇచ్చారు. ఈ వినూత్న ప్రదర్శనను వీక్షించిన ప్రముఖులు ఏవీవీ ఎన్ఎస్ఎస్ వలంటీర్లను అభినందించారు. అభినందించిన వారిలో జీడబ్ల్యూఎంసీ మేయర్ గుండు సుధారాణి, కాకతీయ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ, కాళోజి నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ రామ్ నర్సింహారెడ్డి, ఎన్ వై కేడీ డీ అన్వేష్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజ్ఞాన్, సీనియర్ వలంటీర్లు శివరాజ్, సాత్విక్, దేవిశ్రీప్రసాద్, సాయి హర్షిత్, సిద్ధు, దస్తగిరి, నవ్య శ్రీ, మిన్ను, మన్మిత తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప ఆలయంలో అన్న ప్రసాద వితరణ



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణంలోని హరిహరసుత అయ్యప్ప ఆలయంలో శనివారం మహా అన్న ప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది. రఘు రాజిరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో ఈ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్న ప్రసాద కార్యక్రమంలో పాల్గొన్న అయ్యప్ప స్వాములు అన్నదానాన్ని స్వీకరించి, దంపతులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, గురుస్వాములు, భక్తులు పాల్గొన్నారు. వారిలో బాపూరావు గురుస్వామి, దేశపతి గురుస్వామి, కానుగుల గోపీనాథ్, సంఘు పురుషోత్తం, చాట్ల రజినీకాంత్, బండారి యాదగిరి ఉన్నారు.

## సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



**వరంగల్ వాయిస్, బాలసముద్రం :** ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు ఉపశమనం అందించే లక్ష్యంతో ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) కింద మంజూరైన చెక్కులను వరంగల్ పశ్చిమ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి శనివారం పంపిణీ చేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో, మొత్తం 30 మంది లబ్ధిదారులకు కలిపి రూ.11,59,500 విలువైన చెక్కులను ఆయన అందజేశారు. చికిత్స ఖర్చులు, అత్యవసర ఆరోగ్య సమస్యలు, ప్రమాదాలు, ఆర్థిక భారాలు వంటి కారణాలతో దరఖాస్తు చేసుకున్న వారికి ప్రభుత్వం ఈ సహాయాన్ని మంజూరు చేసిందని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. లబ్ధిదారుల యొక్క ప్రతి ఫైల్‌ను వ్యక్తిగతంగా పరిశీలించి, త్వరితగతిన మంజూరు జరిగేలా చర్యలు తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రజలకు ఏ కష్టమొచ్చినా ప్రభుత్వం అండగా నిలబడటమే ముఖ్యమని ఆయన చెప్పారు. ప్రజల ప్రాణాలు, ఆరోగ్యం, గృహ భద్రత వంటి అంశాల్లో ఈ చిన్న సహాయం కూడా పెద్ద మార్పు తీసుకురాగలదని అన్నారు. స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యల పరిష్కారానికి మరింత శ్రద్ధ చూపుతున్నామని, అవసరమైన వారందరికీ ఈ నిధి సకాలంలో చేరేలా కృషి చేస్తామని పేర్కొన్నారు.

# శాస్త్రీయ విద్యా సాధనకై విద్యార్థులు పోరాడాలి

◆ పీడీఎస్ యూ రాష్ట్ర నేత పొడపంగి నాగరాజు




**వరంగల్ వాయిస్, నర్సంపేట:** ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా 23వ మహాసభ నర్సంపేటలోని సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ పార్టీ కార్యాలయంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు శాస్త్రీయ విద్యా సాధనకై పోరాడాలని పీడీఎస్ యూ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొడపంగి నాగరాజు పిలుపునిచ్చారు. మహాసభ ప్రారంభానికి ముందు, జిల్లా అధ్యక్షుడు గుర్రం అజయ్ విప్లవ పతాకాన్ని (బిగిపిడికి జెండా) ఎగురవేశారు. అనంతరం ప్రతినిధుల సభలో అమరవీరుల సంతాప తీర్మానాన్ని పీడీఎస్ యూ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి మహేష్ ప్రవేశపెట్టారు. ఈ మహాసభకు ముఖ్యవక్తగా హాజరైన పొడపంగి నాగరాజు మాట్లాడుతూ పీడీఎస్ యూ విద్యార్థి ఉద్యమాల దిక్సూచిగా పనిచేస్తుందని కొనియాడారు. గత 50 సంవత్సరాలుగా దేశంలోని పీడిత, తాడిత విద్యార్థుల భవిష్యత్తునే ప్రధాన ధ్యేయంగా చేసుకొని పోరాడుతోందని తెలిపారు. ప్రభుత్వ విద్య బలోపేతం కావాలని, శాస్త్రీయ విద్యా సాధనకై, అందరికీ సమానమైన విద్యను అందించాలని అలుపెరుగని పోరు నిర్వహిస్తున్న ఏకైక విప్లవ విద్యార్థి సంఘం పీడీఎస్ యూ అని అన్నారు. ఈ పోరాట క్రమంలో పోలీసు నిర్బంధాలను, తప్పుడు కేసులను, మత ఉన్మాదుల దాడులను ఎదురించి తెలుగు నేలపై సువర్ణ అక్షరాలతో చరిత్రను సృష్టించిందని ఆయన పేర్కొన్నారు. ఎన్నో ఉద్యమాలు నిర్వహించి పేద విద్యార్థుల గొంతుకగా నిలిచిందని అన్నారు. శాస్త్రీయ విద్య, సమాజంలో అందరికీ సమానమైన విద్య, అసమానతలు లేనటువంటి సమ సమాజ స్థాపన కోసం తమ జీవితాలను త్యాగం చేసిన విద్యార్థి నాయకులను ఆయన గుర్తుచేసుకున్నారు. వారిలో జార్జిరెడ్డి, జంపాల చంద్రశేఖర్, దుస్సా చేరాలు, ప్రసాద్, శ్రీపాద శ్రీహరి, కోలా శంకర్, చేరాలు, రంగవల్లి, వీరన్న, యానాల మల్లారెడ్డి వంటి నాయకులు ఉన్నారని, వారి ఆశయ సాధనలో విద్యార్థులు ప్రగతిశీల ఉద్యమాలను నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మహాసభలో పలు కీలక తీర్మానాలను సభ ఆమోదించింది. ఉద్యమాన్ని సమీక్షించుకొని, భవిష్యత్ కార్యాచరణ రూపొందించి, విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం బలమైన విద్యార్థి ఉద్యమం నిర్వహిస్తామని ఈ సందర్భంగా నాయకులు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్ యూ మాజీ జిల్లా కార్యదర్శి ఎలకంటి రాజేందర్, ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాచర్ల బాలరాజు, పీడీఎస్ యూ జిల్లా నాయకులు పర్వాన్, ఎడవెల్లి అనిల్, సిద్ధు, సుభాష్ చంద్రబోస్, రాకేష్, సాయి, వినయ్, నవీన్, పవన్, శ్రీధర్, అఖిల్, రాము, విక్రమ్ తో పాటు వివిధ మండలాల విద్యార్థి ప్రతినిధులు పాల్గొన్నారు.

# బీజేపీతోనే గ్రామాల్లో అభివృద్ధి సాధ్యం

◆ బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్



**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట:** గ్రామ పంచాయతీల్లో జరిగే ప్రతి అభివృద్ధి పనికి కేంద్ర ప్రభుత్వమే నిధులు ఇస్తోందని, కాబట్టి బీజేపీకి ఓటేస్తేనే గ్రామాలకు మరిన్ని నిధులు, మరింత అభివృద్ధి సాధ్యమని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ అన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటేస్తే గ్రామ పంచాయతీలకు నయా పైసా కూడా రాదని ఆయన హెచ్చరించారు. గ్రామ పంచాయతీ ఎన్నికలలో భాగంగా శనివారం వర్ధన్నపేట నియోజకవర్గంలో చింతా నెక్కొండ, కట్రియాల, కడరిగూడెం, పలు గ్రామాల్లో సర్పంచ్, వార్డు మెంబర్లుగా నామినేషన్లు దాఖలు చేయించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జాతీయ కౌన్సిల్ మెంబర్ గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ అధికారంలోకి రావడానికి ముందు కాంగ్రెస్ ఇచ్చిన అనేక హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని గంట రవికుమార్ మండిపడ్డారు. మహిళలకు రూ. 2,500 పింఛన్లు, రైతు రుణమాఫీ, ఉచిత యూరియా సరఫరా వంటి కీలక వాగ్దానాలు ఇప్పటికీ పూర్తిస్థాయిలో అమలు కాలేదని, ఈ విషయాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలని కార్యకర్తలకు మార్గనిర్దేశనం చేశారు. పంట సాయం అందించడంలో జాప్యం, రైతు సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వ వైఫల్యం, పంటలకు మద్దతు ధర (ఎంఎస్పీ)పై చట్టపరమైన హామీని ఇవ్వకపోవడం వంటివి గ్రామీణ ప్రాంతాల్లో రైతుల నుండి తీవ్ర వ్యతిరేకతకు కారణమవుతున్నాయని ఆయన అన్నారు. ఈ స్థానిక ఎన్నికలతో కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పే అవకాశం వచ్చిందని పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో, కాంగ్రెస్ పార్టీ తమ “కామారెడ్డి డిక్లరేషన్”లో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇస్తామని వాగ్దానం చేసి మోసం చేసిందని గంట రవికుమార్ ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన జీవో 46 ప్రకారం, బీసీలకు కేవలం 17శాతం రిజర్వేషన్లు మాత్రమే కేటాయించి బీసీల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం మొండిచేయి చూపిందని ఆయన తీవ్ర విమర్శ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లాడి తిరుపతిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు పట్టాపురం ఏకాంతం గౌడ్, గడల కుమార్, జిల్లా కార్యదర్శి జడ సతీష్, అధికార ప్రతినిధి మహేందర్ రెడ్డి, పర్వతాగిరి మండల అధ్యక్షులు భిక్షపతి యాదవ్, మండల నాయకులు కుడికల శ్రీధర్, పెద్దూరి రాజు, దేవేందర్ గౌడ్, పిచ్చిరెడ్డి, తదితర నాయకులు పాల్గొన్నారు.

# సర్వైకల్ క్యాన్సర్ నివారణకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ ఎంతో ముఖ్యం

● డాక్టర్ సుమిత్ర తిప్పని



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** నగరంలోని ప్రముఖ వాగ్దేవి కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ఆధ్వర్యంలో శనివారం “అవేర్నెస్ ఆన్ హెచ్‌పీవీ వ్యాక్సిన్ అండ్ వ్యాక్సిన్ డ్రైవ్” కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. వాగ్దేవి కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపల్ డాక్టర్ కె.శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి, ప్రతిమ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ (ఆరేపల్లి, వరంగల్) నుంచి ప్రముఖ డాక్టర్ సుమిత్ర తిప్పని రిసోర్స్ పర్సన్‌గా హాజరయ్యారు. డాక్టర్ సుమిత్ర తిప్పని విద్యార్థులకు వివిధ రకాల క్యాన్సర్‌లు, ముఖ్యంగా సర్వైకల్ క్యాన్సర్ గురించి వివరించారు. హ్యూమన్ పాపిల్లోమా వైరస్ (హెచ్ పీవీ) లక్షణాలు, దానిని అరికట్టడంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, అలాగే హెచ్‌పీవీ వ్యాక్సిన్ ప్రాధాన్యతను సవివరంగా తెలియజేశారు. ఆడపిల్లలు 9 నుంచి 14 సంవత్సరాల వయసులో ఈ వ్యాక్సిన్ తీసుకోవడం వల్ల కలిగే లాభాలను, ఈ విషయంలో తల్లిదండ్రుల బాధ్యతను ఆమె ప్రముఖంగా ప్రస్తావించారు. అవగాహన కార్యక్రమం అనంతరం, వాగ్దేవి కాలేజ్ ఆఫ్ ఫార్మసీలోని ఫ్యాకల్టీ మెంబర్స్ ఆడపిల్లలకు ఈ వ్యాక్సిన్‌ను అందించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ఫార్మ్.డీ విభాగాధిపతి డాక్టర్ బీఎస్.శరవణభవ, ఫార్మకాలజీ విభాగాధిపతి డా. ఇ.వెంకటేశ్వర్లు, వాగ్దేవి కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ చిరంజీవి, డాక్టర్ ఎస్.పావని, డాక్టర్ స్వర్ణలత, డాక్టర్ పి.గిరిజ, డాక్టర్ ఎం.మాధవి, ఎం.సుమలత, శృతి, డాక్టర్ స్నేహప్రియ, డాక్టర్ మేఘన, ఇతర అధ్యాపకులు, విద్యార్థులను ప్రిన్సిపాల్ డా.కె.శ్రీనివాస్ రెడ్డి అభినందించారు. వాగ్దేవి విద్యాసంస్థల సెక్రటరీ కం కరస్పాండెంట్ డాక్టర్ సీహెచ్.దేవేందర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ సీహెచ్.వాహినీ దేవిలు కూడా ఈ కార్యక్రమ నిర్వహణను, ప్రతిమ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ సిబ్బంది (బ్రాహ్మణి, తేజస్వి తదితరులు) సేవలను అభినందించారు.

# రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందకుండానే మరో ఉపాధ్యాయుడి మృతి

- సీఎంని ప్రశ్నించిన రిటైర్డ్ ఉద్యోగ సంఘాలు
- ఇప్పటి వరకు 28 మంది మృతి




**వరంగల్ వాయిస్, గీసుకొండ:** రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందకపోవడంతో తీవ్ర మానసిక వేదనకు గురై, ప్రాథమిక పాఠశాల, రెడ్డిపాలెం (గీసుకొండ మండలం)లో పనిచేసిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు కంకల బీరయ్య శనివారం మరణించారు. బీరయ్య జూలై 2024లో పదవీ విరమణ చేశారు. క్యాన్సర్ వ్యాధితో సంవత్సరం కాలంగా బాధపడుతున్న ఆయన, తన వద్ద ఉన్న డబ్బులన్నీ వైద్యానికి ఖర్చు చేశారు. "రిటైర్మెంట్ బెనిఫిట్స్ అయినా వచ్చినట్లయితే నా ఆరోగ్యాన్ని బాగు చేసుకుంటాను" అనే ఆవేదనతో, ప్రతిరోజు నాయకులకు ఫోన్ చేస్తూ, తీవ్ర మానసిక వేదనకు గురయ్యారు. ఈ క్రమంలో క్యాన్సర్ వ్యాధి తీవ్రమవడంతో ఆయన మరణించారు. రాష్ట్ర వ్యాప్తంగా మార్చి 2024 నుండి అక్టోబర్ 2025 వరకు రిటైర్డ్ అయిన ఉద్యోగ, ఉపాధ్యాయులు 28 మంది వరకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కళ్ల చూడకుండానే మరణించడం జరిగిందని సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మరణాలపై తెలంగాణ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ బకాయిల సాధన సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కదారి బోగేశ్వర్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు కందుకూరి దేవదాసు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని గట్టిగా ప్రశ్నించారు. "అయ్యా ముఖ్యమంత్రి, ఇంకా ఎంతమంది చనిపోతే మీరు రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లిస్తారు? రిటైర్మెంట్ బెనిఫిట్స్ రాకుండా, వాటిని కళ్ల చూడకుండానే ఇప్పటికీ అనారోగ్యంతో బాధపడుతూ, చికిత్స చేయించుకోవడానికి డబ్బులు లేని వారు ఎంతోమంది ఎదురుచూస్తున్నారు. ఇప్పటివరకు 28 మంది చనిపోయినా ఏమాత్రం కనికరం చూపించడం లేదంటే ఈ ప్రభుత్వాన్ని ఏ విధంగా అర్థం చేసుకోవాలి?" అని వారు ఆవేదనతో ప్రశ్నించారు. ఈ మరణాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని వారు డిమాండ్ చేశారు. కనీసం ఈ నెలలోనైనా రిటైర్మెంట్ బకాయిలు, బెనిఫిట్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ రోజు చనిపోయిన ఉపాధ్యాయుడు కంకల బీరయ్య పార్థివ దేహానికి పూలదండ వేసి, నివాళులర్పించి, వారి కుటుంబానికి సంఘం తరఫున ప్రగాఢ సంతాపం, సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇ.ఇంద్రసేనారెడ్డి, ఆర్. వెంకటాచలం, అజయ్ బాబు పాల్గొన్నారు.

# కేసీఆర్ ఆమరణ దీక్షకు 16 ఏళ్లు

## మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ ఉద్యమాన్ని మలుపుతిప్పి, రాష్ట్ర సాధనకు పునాది వేసిన టీఆర్ఎస్ (ప్రస్తుతం బీఆర్ఎస్) అధినేత కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్షకు నేటితో 16 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ చారిత్రక దీక్షా దివాస్ సందర్భంగా హనుమకొండలోని కాలేజీ సెంటర్‌లో జిల్లా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా ఆయన తెలంగాణ అమరవీరులకు కొంతసేపు మౌనం వహించి నివాళులు అర్పించారు. అనంతరం అమరవీరుల స్థూపానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆ తర్వాత కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి, కవి కాళోజీ నారాయణ రావు గారి విగ్రహానికి పూలమాల వేసి గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ "ఈ దీక్షా దివాస్ తెలంగాణ ఉద్యమానికి ఒక చారిత్రక మలుపు తీసుకువచ్చిన రోజు. 'కేసీఆర్ సచ్చుడో.. తెలంగాణ వచ్చుడో..' అనే పోరు రణ నినాదంతో తెలంగాణ స్వరాష్ట్ర సాధన కోసం ఉద్యమ నేత, ప్రత్యేక రాష్ట్ర సాధకుడు కేసీఆర్ 16 ఏళ్ల క్రితం ఆమరణ నిరాహార దీక్షకు దిగారు. ఆ దీక్షే తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనకు మార్గం సుగమం చేసింది" అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

# కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి ఆశయాలను కొనసాగిద్దాం



**వరంగల్ వాయిస్, ములుగు:** భూమికోసం, భుక్తి కోసం, పీడిత జన విముక్తి కోసం అలుపెరుగని పోరు సాగించి, తన జీవితాన్ని త్యాగం చేసిన తెలంగాణ సాయుధ పోరాట యోధుడు కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి ఆశయాలను నేటి తరాలు కొనసాగించాలని ప్రజాసంఘాల జేఏసీ హనుమకొండ జిల్లా చైర్మన్ మాదాసి సురేష్ పిలుపునిచ్చారు. శనివారం ములుగు జిల్లా కేంద్రంలోని రైతు వేదిక కార్యాలయంలో కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి 41వ వర్ధంతి సభను ములుగు జిల్లా ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ ముంజాల భిక్షపతి గౌడ్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు . ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాదాసి సురేష్ మాట్లాడుతూ చంద్ర పుల్లారెడ్డి కలలుకన్న సమసమాజాన్ని నిర్మించడానికి నేటి యువత పోరాడాలని అన్నారు. వరంగల్ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, సామాజిక విశ్లేషకుడు, న్యాయవాది తీగల జీవన్ గౌడ్ మాట్లాడుతూ... భారత పీడిత జనుల కోసం పోరు సాగించిన భారత విప్లవకారులలో చంద్ర పుల్లారెడ్డి అగ్రగణ్యుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు కర్ణాటకపు సమ్మయ్య, చుంచు నరేష్, రాదండి దేవేందర్, దైద వెంకన్న, ఏశబోయిన సాంబయ్య యాదవ్, బొమ్మిడి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఆత్మను మేల్కొలిపిన మహనీయుడు అందెశ్రీ



**వరంగల్ వాయిస్, కేయూ క్యాంపస్:** తెలంగాణ సాహిత్య సమరయోధుడు, రాష్ట్ర గీత రచయిత అందెశ్రీ స్మృతిలో కాకతీయ విశ్వవిద్యాలయం సెనేట్ హాల్‌లో ఘనంగా సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేయూ వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విశ్వవిద్యాలయం విశ్రాంత అధ్యాపకులు, మాజీ పార్లమెంట్ సభ్యులు ఆచార్య అజ్మీరా సీతారం నాయక్ ఆధ్వర్యంలో ఈ సభ జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు, పరిశోధకులు, బోధనా–బోధనేతర సిబ్బంది, విశ్రాంత ఉద్యోగులు, అతిథులను ఉద్దేశించి ఆచార్య ప్రతాప్ రెడ్డి ప్రసంగించారు. సభ ప్రారంభంలో అందెశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఒక నిమిషం మౌనం పాటిస్తూ నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఆచార్యులు ఆచార్య కే. వెంకటనారాయణ, ఆచార్య బి. సురేష్ లాల్, డా.వీఎస్.రెడ్డి, డా.ఎం.లింగయ్య, డా.చిర్రా రాజు, డా.చారి, డా.ముచ్చెర్ల పృథ్వీ రాజు, పొట్లపల్లి శ్రీనివాస్, జయరాజ్, అందెశ్రీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# పోలింగ్, నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన అధికారులు



**వరంగల్ వాయిస్, దామెర :** గ్రామపంచాయతీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో దామెర ఎస్ఐ కొంక అశోక్, మండల ఎంపీడీవో కల్పనలు మండలంలోని నామినేషన్ సెంటర్లను పరిశీలించారు. నామినేషన్ సెంటర్లలో లైటింగ్, ఇతర అవసరమైన మౌలిక వసతులను గుర్తించి, వాటిని వెంటనే ఏర్పాటు చేసుకోవాలని ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులకు వారు సూచించారు. ఈ పరిశీలనలో ఎస్ఐ ఎంపీడీవో వెంట ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ , పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా, నడికూడ మండలానికి చెందిన కంఠాత్మకూర్, రామకృష్ణాపూర్, కౌకొండ, సర్వాపూర్ గ్రామాలలోని పోలింగ్ స్టేషన్లను నడికూడ మండల ఎంపీడీవో రామకృష్ణ, దామెర ఎస్ఐ కొంక అశోక్ తో కలిసి సందర్శించి, ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించారు.

# తెలంగాణ ఉద్యమకారులకు సన్మానం



**వరంగల్ వాయిస్, వరంగల్:** 'తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో' అనే పోరాట నినాదంతో నాటి ఉద్యమ నేత, బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టడం వలనే కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకటించిందని టీజీఏ రాష్ట్ర అధ్యక్షులు, మాజీ చైర్మన్ మర్రి యాదవ్ రెడ్డి అన్నారు. నవంబర్ 29 దీక్షా దివాస్ సందర్భాన్ని పురస్కరించుకొని వరంగల్ మహా నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద గల దీక్షా దివాస్ పైలాన్ వద్ద కార్యక్రమాన్ని నిర్వహించారు. వరంగల్ ఉమ్మడి జిల్లా ఉద్యమకారుల సంఘం అధ్యక్షులు మరుపల్ల రవి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మాజీ చైర్మన్ మర్రి యాదవ్ రెడ్డి, డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్ మసూద్ ముఖ్యఅతిథులుగా విచ్చేసి దీక్షా దివాస్ పైలాన్‌కు పూలు చల్లి నివాళులర్పించారు. మర్రి యాదవ్ రెడ్డి మాట్లాడుతూ, 2009 నవంబర్ 29న వరంగల్ చౌరస్తా వద్ద ఉద్యమకారులు మరుపల్ల రవి ఆధ్వర్యంలో 45 మంది ఆందోళన చేస్తుండగా, అప్పటి పోలీసులు అకారణంగా వారిపై కేసులు పెట్టి జైలుకు పంపారని గుర్తు చేశారు. డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్ మసూద్ మాట్లాడుతూ, కేసీఆర్ ఇచ్చిన పిలుపునందుకొని ఎంతోమంది ఉద్యమకారులు అనేక ఉద్యమాలను నిర్వహించారని, అయితే అప్పటి ప్రభుత్వం వారిపై కేసులు పెట్టి కోర్టుల చుట్టూ తిప్పిందని అన్నారు. వరంగల్ ఉమ్మడి జిల్లా ఉద్యమకారుల సంఘం అధ్యక్షులు మరుపల్ల రవి మాట్లాడుతూ, 2009 నవంబర్ 29న జరిగిన సంఘటనలను తాము ఏనాడూ మర్చిపోలేమన్నారు. పోలీసులు ఉద్యమకారులను అణచివేయాలని ప్రయత్నించినా, భయభ్రాంతులకు గురిచేసినా భయపడకుండా దీక్షా దివాస్ రోజున వరంగల్ చౌరస్తాలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. పోలీసులు అరెస్ట్ చేసి కోర్టుకు పంపగా, తనతో పాటు 15 మంది మూడు రోజులు జైలు జీవనం గడిపామని గుర్తు చేశారు. అలాగే, అప్పటి బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా అరెస్టు అయి వరంగల్ సెంట్రల్ జైల్లోని బ్యారక్‌కు వచ్చి తమకు ధైర్యం చెప్పినట్లు రవి తెలిపారు. దీక్షా దివాస్ రోజున అరెస్టు అయిన ఉద్యమకారులైన మరుపల్ల రవి, ముసికే ప్రమీల, మేకల ఎల్లయ్య, అంకం దేవానంద్, బొద్దుల కుమార్ స్వామి, కెంచ ఆనంద్, కనకరాజులను మర్రి యాదవ్ రెడ్డి, రిజ్వానా షమీమ్ మసూద్ శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు వనం కుమార్, సోమ మధుకర్, కోడూరి నరేష్, కొడకండ్ల ప్రశాంత్, రాచర్ల రాము, గట్టు చందు, తాళ్ళపెల్లి రమేష్, పూజారి కుమార్ స్వామి, బొమ్మకంటి క్రాంతి, రాగం సతీష్, మరుపల్ల గౌతమ్ లు పాల్గొన్నారు.

# ఇగ్నో టర్మ్ ఎండ్ పరీక్షలు

## డిసెంబర్ 1 నుంచి ప్రారంభం

## ఎల్.బీ కళాశాలలో పరీక్షా కేంద్రం

వరంగల్ వాయిస్, వరంగల్ : ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) దేశవ్యాప్తంగా నిర్వహించే డిసెంబర్ 2025 టర్మ్ ఎండ్ పరీక్షలు డిసెంబర్ 1 నుంచి జనవరి 14, 2026 వరకు జరుగుతాయని అధికారులు ప్రకటించారు. వరంగల్ లాల్ బహదూర్ (ఎల్.బీ) కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డీహెచ్.రావు, ఇగ్నో అధ్యయన కేంద్రం కో–ఆర్డినేటర్ ఎస్.వి.రమణారెడ్డి, ఇగ్నో హైదరాబాద్ ప్రాంతీయ కేంద్రం రీజనల్ డైరెక్టర్ డాక్టర్ రాజు బోల్లా సంయుక్తంగా ఈ ప్రకటన చేశారు. డిగ్రీ, పీజీ విద్యార్థులతో పాటుగా డిప్లొమా, పీజీ డిప్లొమా మరియు సర్టిఫికెట్ ప్రోగ్రాములకు సంబంధించిన ఈ పరీక్షలు వరంగల్‌లోని ఎల్.బీ కళాశాల పరీక్షా కేంద్రంలో నిర్వహించబడతాయి. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు తమ హాల్ టిక్కెట్లను ఇగ్నో వెబ్ సైట్ www.ignou.ac.in నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు నిర్ణీత సమయం కన్నా ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి. పరీక్షా కేంద్రంలోకి ఏవిధమైన మొబైల్ ఫోన్స్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకురావడం నిషేధం. విద్యార్థులు తప్పనిసరిగా ఇగ్నో వర్సిటీ పేర్కొన్న నిబంధనలను విధిగా పాటించాలని అధికారులు తెలిపారు. ఇతర పూర్తి వివరాల కోసం అభ్యర్థులు 98493 81085 నంబర్‌లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

# మాట తప్పిన ముఖ్యమంత్రి రేవంత్

■ మాజీ ఎమ్మెల్యే రెడ్యా నాయక్ మండిపాటు



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** తన 40 సంవత్సరాల సుదీర్ఘ రాజకీయ జీవితంలో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లాంటి మాట తప్పే ముఖ్యమంత్రిని చూడలేదని డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే రెడ్యా నాయక్ విమర్శించారు. సర్పంచ్ ఎన్నికల సన్నాహక సమావేశంలో భాగంగా గొల్లచర్లలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి తన నోటి నుంచి వాగ్దానం చేశారంటే దానికి కట్టుబడి వ్యవహరించాలని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ తరపున గెలిచి, ప్రజలకు అత్యున్నత సేవలు అందించి, ప్రజా గుండెల్లో నిలిచిపోయిన వ్యక్తి దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖర రెడ్డి మాత్రమే అని కొనియాడారు. సాధ్యం కానీ అనేక హామీలను ఇచ్చి, నేడు వాటిని తీర్చకుండా కాలయాపన చేస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ప్రజలు తప్పక గద్దె దించుతారని రెడ్యా నాయక్ అన్నారు. కామారెడ్డి డిక్లరేషన్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని గొప్పలు పోయిన రేవంత్ రెడ్డి, ప్రస్తుతం బీఆర్ఎస్ కల్పించిన 27 శాతం రిజర్వేషన్ను కూడా అమలు చేయలేదని ఆయన మండిపడ్డారు. ముఖ్యంగా డోర్నకల్ నియోజకవర్గంలో ఒక్క గ్రామాన్ని కూడా బీసీలకు రిజర్వ్ చేయలేదని ఆయన గుర్తు చేశారు. ప్రజలకు జరిగిన అన్యాయాన్ని మనసులో పెట్టుకుని, రాబోయే స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థులను గెలిపించాలని రెడ్యా నాయక్ ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో కత్తెరసాల విద్యాసాగర్, ధర్మసోత్ బాలు నాయక్, చేరెడ్డి భిక్షం రెడ్డి, నంద్యాల మదుసూదన్, చాగర్లముడి శ్రీనివాస్, బానోతు పాండు నాయక్, రాయల వెంకటేశ్వర్లు, పగడాల అంజయ్య, ఎలమద్ది మన్మధ రావు, బోయినపల్లి వెంకన్న, ఇంజన్ కృష్ణయ్య, చేరెడ్డి సమ్మి రెడ్డి, కొర్ని సంతోష్, కాడెం ప్రశాంత్, కాడెం బాబు, శ్రీనివాస్ నాయక్, నరేష్ బాబు, మడ్డి శ్రీనివాస్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## హిందీ పండిట్ బండ రవీందర్ సేవలు ప్రశంసనీయం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ నగరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, శంభునిపేటలో స్కూల్ అసిస్టెంట్ హిందీ పండిట్‌గా విధులు నిర్వర్తించిన, జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత బండ రవీందర్ సేవలు ప్రశంసనీయమని పలువురు వక్తలు కొనియాడారు. ఉద్యోగ విరమణ సందర్భంగా ఆ పాఠశాలలో శనివారం సాయంత్రం బండ రవీందర్‌కు ఉద్యోగ విరమణ సన్మాన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శారదాబాయి, ఉపేందర్, ప్రైమరీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు తాళ్లపల్లి ప్రకాష్ గౌడ్, శ్రీకాంత్, బీసీటీయూ వరంగల్ జిల్లా అధ్యక్షులు పెరుమాండ్ల సాంబమూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బండ రవీందర్ 33 ఏళ్లుగా పేద విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి అహర్నిశలు కృషి చేశారని అభినందించారు. పాఠశాల ఉపాధ్యాయ బృందం రఫీక్ అహ్మద్, లక్పతి, హాజీ, కాసుల రమేష్, సత్యనారాయణ, రమాదేవి, వివేక్, శ్రీనివాస్, ఊహ తదితరులు రవీందర్‌ను ఘనంగా సత్కరించారు. అనంతరం అధిక సంఖ్యలో హాజరైన పూర్వ విద్యార్థులు కూడా బండ వసంత రవీందర్ దంపతులను శాలువాలతో ఘనంగా సన్మానించి, బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు షర్ఫోద్దిన్, నాగరాజు, ఉర్దూ మీడియం ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డి పథకాలే అభ్యర్థులను గెలిపిస్తాయి



**వరంగల్ వాయిస్, డోర్నకల్:** బీఆర్ఎస్ నాయకుల అధికార అహంకారాన్ని, అవినీతిని అంతం చేయాలనే తలంపుతోనే ప్రజలు కాంగ్రెస్ నాయకులకు జై కొట్టారని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ బత్తుల శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సర్పంచ్ ఎన్నికల సన్నాహక సమావేశంలో భాగంగా గొల్లచర్ల గ్రామంలోని ఫంక్షన్ హాల్‌లో జరిగిన మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అభివృద్ధి మాటున నిధులు దుర్వినియోగానికి పాల్పడిందని ఆయన ఆరోపించారు. ఇందుకు చరమగీతం పాడిన ప్రజలు, జరగబోయే గ్రామపంచాయతీ ఎన్నికల్లో మరోమారు కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలన కొనసాగిస్తూ అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కృషి చేస్తోందని డాక్టర్ బత్తుల శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమలు చేస్తున్న పథకాలే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపుకు దోహదపడతాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గ్రామాల అభివృద్ధికి, పార్టీ బలోపేతానికి గ్రామపంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను అత్యంత మెజార్టీతో గెలిపించాలని ఆయన కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కాలం రవీందర్ రెడ్డి, హనుమా, గంగాధర్, వెంకట్ బాబు, వెంకన్న, డీజే.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రెండో విడత నామినేషన్లకు ఏర్పాట్లను పూర్తి చేయండి

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికల రెండో విడత నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ఆదివారం నుంచి మొదలవుతుందని, ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లను సంబంధిత మండలాల ఎంపీడీవోలు, అధికారులు పూర్తిచేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశించారు. శనివారం హనుమకొండ కలెక్టరేట్ నుండి రెండో విడతలో నామినేషన్లు ఈ నెల 30 నుండి డిసెంబర్ 2 తేదీ వరకు స్వీకరించనున్న ధర్మసాగర్, హసన్ పర్తి, ఐనవోలు, పరకాల మండలాల ఎంపీడీవోలు, నోడల్ అధికారులు,రిటర్నింగ్ అధికారులతో జిల్లా కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు.

## నామినేషన్ ప్రక్రియలో అభ్యర్థులు జాగ్రత్త వహించాలి




**వరంగల్ వాయిస్, వెంకటాపూర్ :** గ్రామ పంచాయతీ ఎన్నికలలో నామినేషన్ వేసే అభ్యర్థులు ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు వహించాలని వెంకటాపూర్ తహసీల్దార్ గిరిబాబు, ఎస్ఐ చల్లా రాజు, ఎంపీడీవో మూడు రాజు సూచించారు. నామినేషన్ దాఖలుపై శనివారం వెంకటాపూర్ తాసిల్దార్ కార్యాలయంలో వీరు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నామినేషన్ వేసే అభ్యర్థుల వెంట ఇద్దరు బలపరిచే వ్యక్తులు (సాక్షులు) మాత్రమే రావాలని స్పష్టం చేశారు. నామినేషన్‌తో పాటు ఇద్దరు సాక్షులతో సెల్ఫ్ డిక్లరేషన్ తప్పనిసరిగా దాఖలు చేయాలి. ఎవరైనా అభ్యర్థి నామినేషన్‌తో పాటు సెల్ఫ్ డిక్లరేషన్‌ను దాఖలు చేయడంలో విఫలమైతే, నామినేషన్ వేసే చివరి తేదీ సాయంత్రం 5.00 గంటలలోపు దానిని దాఖలు చేయాలని పేర్కొన్నారు. డిక్లరేషన్ కోసం అఫిడవిట్ కానీ, నోటరీ కానీ అవసరం లేదని తెలిపారు. నామినేషన్ ఫారంలోని అన్ని నిలువు వరుసలను తప్పకుండా పూరించాలి. ఏ కాలమ్‌ను కూడా ఖాళీగా ఉంచకూడదు. ఏదైనా అంశానికి సంబంధించి అందించడానికి సమాచారం లేకుంటే, సందర్భానుసారంగా 'నిల్' లేదా 'వర్తించదు' అని పేర్కొనాలి. పోస్టల్, బ్యాంక్ ఖాతా లేదా ఇతర బ్యాంకుల్లో ఖాతాలు ఉన్నప్పటికీ, నామినేషన్ వేసే అభ్యర్థి నూతన బ్యాంకు ఖాతాను తప్పనిసరిగా తీసుకోవాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాల అభ్యర్థులకు కుల ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా జత చేయాలి. సర్పంచ్, వార్డ్ మెంబర్ స్థానాలకు పోటీ చేసే అభ్యర్థులు తప్పకుండా సెక్యూరిటీ డిపాజిట్ చేయవలసి ఉంటుందని తెలిపారు. నామినేషన్ వేసే అభ్యర్థులు ఈ సూచనలను తప్పకుండా పాటించాలని అధికారులు కోరారు.

## ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన ర్యాలీ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** స్థానిక లాల్ బహదూర్ (ఎల్.బీ) కళాశాల, ఎన్.సీ.సీ ఆర్మీ 10వ తెలంగాణ బెటాలియన్ ఆధ్వర్యంలో శనివారం ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. డిసెంబర్ 1న అంతర్జాతీయ ఎయిడ్స్ నియంత్రణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజల్లో అవగాహన కల్పించడమే లక్ష్యమని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డీ.హెచ్.రావు తెలిపారు. కళాశాల ఎన్.సీ.సీ క్యాడెట్స్ మొదట ఎయిడ్స్ నియంత్రణపై ప్రతిజ్ఞ చేసి, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ములుగు రోడ్డులోని కేఎంసీ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డీ.హెచ్ రావు మాట్లాడుతూ... ప్రాణాంతక వ్యాధి అయినప్పటికీ, అవగాహన లోపం వల్లే మానవ సమాజానికి తీవ్ర నష్టం జరిగిందని అన్నారు. ప్రజలు అపోహలు తొలగించుకొని, ఎయిడ్స్ నియంత్రణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం నియంత్రణలోకి వస్తున్న ఎయిడ్స్ వ్యాధిపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించడమే ఈ ర్యాలీ ముఖ్య ఉద్దేశమని ఆమె తెలిపారు. 10వ తెలంగాణ ఆర్మీ బెటాలియన్ ఆధ్వర్యంలో ఈ భారీ ర్యాలీ నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో కెప్టెన్ డాక్టర్ ఎం.సదానందం, సాయి గణేష్, హరి లోకేష్, సిరివెన్నెల, కౌశిక్, అజయ్, అభినయ్, లక్ష్మి ప్రసాద్, సింధు, మన శ్రీ, రాహుల్, యశ్వంత్ వంటి సీనియర్ క్యాడెట్స్ పాల్గొన్నారు.

## సీనియర్ ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు ఇవ్వాలి


• ఎంపీ కడియం కావ్యకు టీఎస్‌యూటీఎఫ్ విజ్ఞప్తి



**వరంగల్ వాయిస్, కాశీబుగ్గ :** ఉద్యోగ విరమణకు దగ్గరలో ఉన్న సీనియర్ ఉపాధ్యాయులకు టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్ నుంచి మినహాయింపు ఇచ్చి, వారి ఉద్యోగ రక్షణ కల్పించాలని కోరుతూ తెలంగాణ స్టేట్ యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ వరంగల్ పార్లమెంటు సభ్యులు కడియం కావ్యకి విజ్ఞప్తి చేసింది. శనివారం సాయంత్రం వారి నివాస కార్యాలయంలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.రంజిత్ కుమార్, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు డి.కిరణ్ కుమార్ లతో పాటు వరంగల్ జిల్లా కమిటీ సభ్యులు ఎంపీని కలిసి సమస్యను వివరించారు. టీఎస్‌యూటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం 2010 నుంచి అమల్లోకి వచ్చినప్పటికీ, అంతకుముందు నియామకమైన సీనియర్ ఉపాధ్యాయులకు కూడా టెట్ పరీక్ష నిర్వహించడం అసమంజసమని పేర్కొన్నారు. టెట్ ఉత్తీర్ణత సాధించనట్లయితే రెండు సంవత్సరాలలో టర్మినేషన్ చేస్తామని భయభ్రాంతులకు గురిచేయడం అన్యాయమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశంపై తెలంగాణతో సహా ఇంకా ఐదు రాష్ట్రాలు సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేశాయని తెలిపారు. రానున్న పార్లమెంటు సమావేశంలో ఈ అంశాన్ని ప్రస్తావించి, సమస్య పరిష్కారానికి కృషి చేయాలని వారు ఎంపీని కోరారు. దీనిపై ఎంపీ కడియం కావ్య సానుకూలంగా స్పందిస్తూ, సీనియర్ ఉపాధ్యాయుల ఉద్యోగ రక్షణ కోసం ఈ సమస్య పరిష్కారం నిమిత్తం తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ వరంగల్ జిల్లా అధ్యక్షులు తాటికాయల కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి సి. సుజన్ ప్రసాదరావు, జిల్లా కోశాధికారి రవూఫ్, జిల్లా కార్యదర్శులు నామోజు శ్రీనివాస్, కందగట్ల రమేష్, జి.విజయ్, తాబేటి కుమార్, గుండు కర్ణాకర్, కె.రవీందర్, పోశాల కుమారస్వామి, దుద్యాల రవీందర్, బాదావత్ శ్రీనివాస్, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభాస్ లుక్ కనిపించకుండా వంగా జాగ్రత్తలు





### ఆరు నెలలపాటు పబ్లిక్ ఈవెంట్‌లకు దూరంగా రెబల్

ప్రభాస్, సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో రానున్న మోస్ట్`అవైటెడ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రం 'స్పిరిట్' గురించి ఒక ఆసక్తికరమైన వార్త ప్రస్తుతం టాలీవుడ్‌లో చర్చనీయాంశమైంది. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఇటీవల మొదలవ్వగా, దర్శకుడు సందీప్ వంగా ప్రభాస్ లుక్ విషయంలో అత్యంత గోప్యత పాటిస్తున్నట్లు తెలుస్తోంది. తాజా సమాచారం ప్రకారం 'స్పిరిట్' సినిమాలోని ప్రభాస్ పాత్ర లుక్‌ను అభిమానులకు సర్‌ప్రైజ్‌గా ఉంచాలని సందీప్ వంగా గట్టిగా నిర్ణయించుకున్నారు. అందుకే, ఈ లుక్ లీక్ అవ్వకుండా ఉండేందుకు, రాబోయే ఆరు నెలల పాటు ప్రభాస్‌ని పబ్లిక్ ఈవెంట్స్‌కు దూరంగా ఉండాలని కోరినట్లు సమాచారం. పబ్లిక్ ఈవెంట్లు, ఎయిర్‌పోర్ట్‌లలో ప్రభాస్ కనిపిస్తే, ఆయన లుక్‌ను అభిమానులు లేదా మీడియా ఫొటోలు తీసే అవకాశం ఉంది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని, కొన్ని నెలల పాటు ఎలాంటి ప్రచార కార్యకలాపాలు లేదా బహిరంగ కార్యక్రమాలకు హాజరు కాకూడదని ప్రభాస్, సందీప్ వంగా నిర్ణయించుకున్నట్లుగా వార్తలు వినిపిస్తున్నాయి. ఈ నిర్ణయం ప్రభాస్ అభిమానులను కొంత నిరాశపరిచినా సందీప్ వంగా ప్రభాస్‌ను ఏ విధంగా ప్రెజెంట్ చేయబోతున్నారో చూడాలనే ఉత్సాహం మాత్రం వారిలో ఎక్కువగా ఉంది. 'స్పిరిట్' చిత్రంలో త్రిప్తి దిమ్రి కథానాయికగా నటిస్తుండగా, వివేక్ ఒబెరాయ్, ప్రకాశ్ రాజ్, కాంచన ఇతర ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. ఈ భారీ చిత్రం 2027లో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉంది.

### స్పిరిట్‌లో హిందీనటి కాజోల్ నటిస్తుందా?

ఈ చిత్రం మెగాస్టార్ చిరంజీవి చేతుల మీదుగా ఇటీవల పూజా కార్యక్రమాలు పూర్తి చేసుకున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ జరుపుకుటుండగా.. ఈ ప్రాజెక్ట్ గురించి ఇండస్ట్రీలో ఒక ఆసక్తికరమైన వార్త ప్రస్తుతం జోరుగా వినిపిస్తోంది. ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో బాలీవుడ్ సీనియర్ స్టార్ హీరోయిన్ కాజోల్ దేవగణ్ కీలక పాత్ర పోషించనున్నట్లు తెలుస్తుంది. 'స్పిరిట్' చిత్రంలో మొదట హీరోయిన్ పాత్ర కోసం బాలీవుడ్ నటి కరీనా కపూర్ పేరు వినిపించినప్పటికీ, ఆమె ఆ రూమర్‌లను ఖండిరచారు. తాజాగా అందిన సమాచారం ప్రకారం, 'స్పిరిట్'లో ఒక శక్తివంతమైన పాత్ర కోసం దర్శకుడు సందీప్ రెడ్డి వంగా బాలీవుడ్ నటి కాజోల్‌ను సంప్రదించినట్లు తెలుస్తోంది. కాజోల్‌కి కూడా స్క్రిప్ట్ బాగా నచ్చిందని ఆమె ఈ ప్రాజెక్ట్‌లో భాగమవడానికి పాజిటివ్‌గా స్పందించినట్లు ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి.
ఈ వార్త నిజమైతే, 'స్పిరిట్' కాజోల్‌కు మొదటి తెలుగు సినిమా కానుంది.

# దుమ్మురేపుతున్న.. పెద్దిరెడ్డి సాంగ్

తెలంగాణ జానపద గాయని, నృత్యకారిణి నాగదుర్గ నుంచి తాజాగా విడుదలైన పాట 'పేరుగల్ల పెద్దిరెడ్డి' ప్రస్తుతం యూట్యూబ్‌లో మరియు సోషల్ మీడియాలో దుమ్మురేపుతోంది. తెలంగాణ ఫోక్ సాంగ్స్‌తో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నాగదుర్గ, ఈ కొత్త పాటతో మరోసారి ప్రేక్షకులను ఆకర్షిస్తున్నారు. పేరుగల్ల పెద్దిరెడ్డి అంటూ వచ్చిన ఈ పాట తండ్రి మీద ప్రేమతో కూతురు చెబుతున్న నేపథ్యంలో ఉంది. పల్లెటూరి వాతావరణాన్ని, జానపద లయను ప్రతిబింబిస్తూ ఈ పాట ఆకట్టుకుంటుంది. ఎప్పటిలాగే, నాగదుర్గ ఈ పాటలో తనదైన శైలిలో చేసిన ఎనర్జిటిక్ డ్యాన్స్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. శుక్రవారం విడుదలైన ఈ పాట కొద్ది గంటల్లోనే యూట్యూబ్‌లో మిలియన్ల వ్యూస్‌ను సాధిస్తూ ట్రెండిరగ్‌లో నిలిచింది. ఫ్లలె జానపద పాటల అభిమానుల మధ్య ఈ పాట క్రేజీ హిట్‌గా మారడంతో నాగదుర్గ ఖాతాలో మరో విజయవంతమైన జానపద పాట చేరింది. ఈ పాటకు బుల్లెట్ బండి లక్ష్మణ్ సాహిత్యం అందించగా.. మమత రమేష్ పాడిరది. మదన్ కే సంగీతం అందించాడు.





# బాలకృష్ణ మాత్రమే ఆ పాత్ర చేయగలడు

'అఖండ 2' కథ చెప్పినప్పుడు తనకు గూస్‌బంప్స్ వచ్చాయని నటుడు మురళీ మోహన్ అన్నారు. బోయపాటి శ్రీను దర్శకత్వంలో బాలకృష్ణ నటించిన చిత్రం 'అఖండ 2'. డిసెంబర్ 5న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో మురళీ మోహన్ మాట్లాడుతూ.. ఈ సినిమాలో బాలకృష్ణ కాకుండా మరొకరు చేయలేరు అనిపించిందన్నారు. బాలకృష్ణ మాత్రమే ఈ పాత్ర చేయగలడని నిరూపించారని అన్నారు. పాత్ర అంత పవర్‌ఫుల్‌గా ఉందన్నారు. బాలకృష్ణతో 'అఖండ 2' చేస్తే అందరికీ పరమేశ్వరుడే కనిపించాలన్న లక్ష్యంతో బరిలోకి దిగినట్లు దర్శకుడు బోయపాటి శ్రీను అన్నారు. ఆయన దర్శకత్వంలో బాలకృష్ణ హీరోగా ముస్తాబైన చిత్రం 'అఖండ 2' హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్ ఏర్పాటు చేశారు. ఆ భగవంతుడే తనతో ఈ చిత్రం చేయించుకున్నాడని బోయపాటి

# ఓటీటీ వేదికగా శివ

ఒకప్పటి కల్ట్ క్లాసిక్ 'శివ' ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చి మరోసారి సందడి చేసిన క్రమంలో.. ఇప్పుడీ చిత్రాన్ని ఓటీటీలోకి అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని నాగార్జున చెప్పారు. తాజాగా గోవా వేదికగా జరిగిన ఇఫి వేడుకలో ఆయన పాల్గొన్నారు. 'శివ' గురించి, ఏయన్నార్ చిత్రాల గురించి మాట్లాడారు. శివ' రీరిలీజ్ వెర్షన్ ఓటీటీలో విడుదల చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి . ఇప్పటికే పలు సంస్థలతో చర్చలు జరిపాం. ఎంతో కష్టపడి దీన్ని 4కే వెర్షన్‌లోకి మార్చాం. ఇప్పుడు గొప్ప టెక్నాలజీ అందుబాటులోకి వచ్చింది. అన్నపూర్ణ స్టూడియోస్‌లో మంచి సాంకేతికత అందుబాటులో ఉందని చెప్పారు. ఏయన్నార్ అలనాటి అనేక అపూర్వ సినిమాలను 4కే వెర్షన్‌లోకి మార్చాలంటే నెగెటివ్స్ లేవని చెప్పారు. అధునాతన సాంకేతిక హంగులతో ఏయన్నార్ పాత చిత్రాలను మళ్లీ ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని ఉన్నా.. రైట్స్, నెగెటివ్స్ లేకపోవడంతో సాధ్యం కావట్లేదని నాగార్జున తెలిపారు. తన 100వ చిత్రం నుంచి కూడా త్వరలోనే అప్‌డేట్స్ వస్తాయని తెలిపారు.






# ఆపద్బాంధవుడు శ్రీవిష్ణు

**దర్శకుడు వేణు ఉడుగుల ఎమోషన్**

తెలంగాణ నేపథ్యంలో వాస్తవిక అంశాలతో కూడిన సినిమాలు తీసే దర్శకుడిగా పేరు తెచ్చుకున్న వారిలలో వేణు వుడుగుల ఒకరు. నీది నాది ఒకే కథ(2018), విరాట పర్వం ఇలా తీసింది రెండు చిత్రాలే అయిన మంచి దర్శకుడిగా స్థానాన్ని నిలుపుకున్నాడు. తాజాగా అతడి నిర్మాణంలో వచ్చిన చిత్రం రాజు వెడ్స్ రాంబాయి. రూరల్ బ్యాక్‌డ్రాప్‌లో వచ్చిన ఈ చిత్రం సూపర్‌హిట్‌ను అందుకుంది. అయితే ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా వేణు ఉడుగుల మాట్లాడుతూ.. తన మొదటి సినిమా హీరో శ్రీవిష్ణు చేసిన సహాయాన్ని గుర్తు చేసుకుని ఇటీవల భావోద్వేగానికి లోనయ్యారు. శ్రీవిష్ణు కథానాయకుడిగా వేణు దర్శకత్వంలో వచ్చిన చిత్రం 'నీది నాది ఒకే కథ' (2018). ఈ సినిమా సమయంలో తన ఆర్థిక ఇబ్బందుల గురించి వేణు తాజాగా మాట్లాడుతూ.. నా మొదటి సినిమా ప్రయాణాన్ని ప్రారంభించినప్పుడు, నేను కొన్ని తీవ్రమైన ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నాను. అప్పులు చాలా ఉండేవి. ఒకరోజు నన్ను శ్రీవిష్ణు చూసి ఎందుకు మీరు ఇలా ఉంటారు ఎప్పుడు ఏదో బాధతో అని అడిగాడు. ఏమైన అప్పులు ఉన్నాయా అంటూ తెలుసుకున్నాడు. నేను కూడా చిన్న చిన్నవే అంటూ చెప్పాను. దీంతో నా పరిస్థితి తెలుసుకున్న శ్రీ విష్ణు ఆ మరుసటిరోజే నాకున్న అప్పులన్నీ తీర్చేశాడు. ఆయనకు ఏం అవసరం ఇది చేయడానికి.. అయిన కూడా చేశాడు. ఆరోజు శ్రీవిష్ణు చేసిన సహాయాన్ని నేను ఎప్పటికీ మర్చిపోలేను. ఆయన నా సినిమాకు కేవలం హీరో మాత్రమే కాదు, నా కష్టకాలంలో నాకు అండగా నిలబడిన ఒక దైవంగా భావిస్తాను అంటూ వేణు చెప్పుకోచ్చాడు.






# స్వప్నం సాకారమవుతోంది

- 75 శాతం పూర్తయిన రైల్వే తయారీ యూనిట్
- వచ్చే ఏడాదికి పనులు పూర్తి
- కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి

**వరంగల్ వాయిస్, కాజీపేట :** తెలంగాణ రాష్ట్ర ప్రజల చిరకాల స్వప్నం సాకారమవుతోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. కాజీపేటలో రైల్వే తయారీ యూనిట్ నిర్మాణానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2023లో శంకుస్థాపన చేయగా ఇప్పటికే 75 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. పనులు వేగంగా జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. రూ. 521 కోట్ల వ్యయంతో రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ (ఆర్‌వీఎన్ఎల్) ఈ ప్రాజెక్టును అమలు చేస్తోందని ఆయన తెలిపారు. కాజీపేటలోని రైల్వే తయారీ యూనిట్‌ను శనివారం కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి, ఇతర ప్రముఖులు, ప్రజా ప్రతినిధులతో కలిసి సందర్శించారు. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ, దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ బిజయ్ కుమార్ రత్, సికింద్రాబాద్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ డాక్టర్ ఆర్. గోపాలకృష్ణన్, ఆర్‌వీఎన్ఎల్ చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ పీవీ.సాయిప్రసాద్, దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ ఎ.శ్రీధర్, ఇతర సీనియర్ అధికారులు పరిశీలించారు. రైల్వే తయారీ యూనిట్‌లో జరుగుతున్న పనుల పురోగతిని కేంద్ర మంత్రి సమీక్షించారు. నిర్మాణ స్థలంలో భద్రతా అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో కిషన్ రెడ్డి మాట్లాడుతూ మెయిన్ షాప్, టెస్ట్ షాప్, పెయింట్ షాప్, స్టోర్ వార్డ్, అడ్మిన్ బ్లాక్, రెస్ట్ హౌస్, క్యాంటీన్, సెక్యూరిటీ, టాయిలెట్ బ్లాక్స్, బౌండరీ వాల్, ఆర్‌యుబి, అంతర్గత రైల్వే ట్రాక్, రోడ్లు, ఎలక్ట్రిక్ సబ్‌స్టేషన్, క్యాంటీన్‌లను ఆర్ఎంయూలో నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. ఇంకా, 1 మెగావాట్ల పైకప్పు సోలార్ ప్లాంట్, సహజ పగటిపూట లైటింగ్ మరియు సహజ వెంటిలేషన్, ఎల్ఇడి లైటింగ్, మురుగునీటి శుద్ధి కర్మాగారం, వ్యర్థ జలాల రీసైక్లింగ్ ప్లాంట్, వర్షపు నీటి సేకరణ మొదలైన పనులు కూడా పురోగతిలో ఉన్నాయన్నారు. ఇప్పటికే 75 శాతం పనులు పూర్తయ్యాయని, ఈ ప్రాజెక్టును వచ్చే ఏడాది నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఆర్ఎంయూలో 16 కోచ్ మెము రేక్‌లను తయారు చేయాలని ప్రతిపాదించినట్లు ఆయన తెలిపారు. రాబోయే రైల్వే తయారీ యూనిట్‌లో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు ఈ ప్రాంతంలోని యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధిని కల్పిస్తుందని ఆయన తెలిపారు. ప్రధానమంత్రి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలో రైల్వే మౌలిక సదుపాయాలు అపూర్వమైన అభివృద్ధిని సాధిస్తున్నాయని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. ఉదయం వరంగల్ రైల్వే స్టేషన్‌కు చేరుకున్న మంత్రి కిషన్ రెడ్డి రైల్వే స్టేషన్ ను పరిశీలించారు. అక్కడ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం, ప్రయాణీకుల సౌకర్యాలను ఆయన సమీక్షించారు. దక్షిణ మధ్య రైల్వే సీనియర్ అధికారులు హాజరయ్యారు.











### అభివృద్ధి పనులపై సమీక్ష..

హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్ లో కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్, ఆర్కియాలజీ అధికారులతో స్మార్ట్ సిటీ తదితర అభివృద్ధి పనులపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సమీక్షించారు. ఈ కార్యక్రమంలో బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, కార్పొరేటర్ లు గుజ్జుల వసంత, చాడ స్వాతి, డీఆర్ఓ విజయలక్ష్మి, కుడా సీపీఓ అజిత్ రెడ్డి, బల్దియా ఎస్ఈ సత్యనారాయణ, జిల్లా పర్యాటక అధికారి శివాజీ, ఆర్కియాలజీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### భద్రకాళిలో పూజలు..

వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ది గాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానాన్నికేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన కేంద్ర మంత్రికి ఆలయ ధర్మకర్తలు ఓరుగంటి పూర్ణచందర్, మోతుకూరి మయూరి రామేశ్వర్ రావు, నార్ల సుగుణ, జారతి వెంకటేశ్వర్లు, బింగి సతీశ్, అనంతుల శ్రీనివాస్, మూగ శ్రీనివాస్ రావు, తొనుపునూరి వీరన్న కార్యనిర్వహణాధికారి రామల సునీత, భద్రకాళి శేషు, వేద విద్యార్థులు పూర్ణకుంభం, మంగళవాద్యాలతో ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా గోశాలలో గోవులకు గోగ్రాసం పెట్టి ఆది శంకరాచార్యులను, వల్లభ గణపతిని దర్శించిన అనంతరం అమ్మవారికి ప్రదక్షిణ చేసి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవాలయ మహా మండపంలో అర్చకులు, వేదపండితులు కిషన్ రెడ్డికి మహదాశీర్వచనం నిర్వహించి శేష వస్త్రములు బాహూకరించి ప్రసాదములు అందజేశారు. ఈ సందర్భంగా దేవాలయ ధర్మకర్తలు వరంగల్, కాజీపేట్ రైల్వే స్టేషన్లలో అమ్మవారి చిత్రపటం ఏర్పాటు చేయాలంటూ వినతి పత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో రావు పద్మ, గంట రవికుమార్, డాక్టర్ కాళీప్రసాద్, ఎర్రబెల్లి ప్రదీప్ రావు, ఆరూరి రమేష్, మర్తినేని ధర్మా రావు, ప్రొఫెసర్ సీతారాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

### వేయి స్థంబాల ఆలయంలో..

హనుమకొండలోని ప్రసిద్ధ వెయ్యి స్థంబాల ఆలయానికి చేరుకున్న కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డికి ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్ర శర్మ, అధికారులు పూర్ణ కుంభం స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నందీశ్వరుడికి, స్వామి వారికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు.



## పుష్-పుల్ పునరుద్ధరించండి

☐ కేంద్ర మంత్రికి గంట రవికుమార్ వినతి

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ నుంచి హైదరాబాద్ వరకు గతంలో షటిల్ సర్వీస్ నిర్వహించిన పుష్–పుల్ రైలును పునఃప్రారంభించాలని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ కోరారు. ఈ మేరకు నగరానికి చేరుకున్న కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డికి గంట రవికుమార్ వినతిపత్రం అందజేశారు. ప్రయాణికుల సౌకర్యార్థం బోగీల సంఖ్యను పెంచాలన్నారు. పుష్–పుల్ రైలును ప్రారంభిస్తే వేలాదిమంది ప్రయాణికులకు లబ్ధి చేకూరుతుందన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com